# నవ భారత నిర్మాత నెహ్రూ

-నివాళులర్పించిన భట్టి



2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 28 | మే | 2026
పేజీలు : 8

# సారూ.. స్పందించరేమి...?

## -వదిలేశారా... వద్దనుకున్నారా..?
## -కబ్జాలపై కదలని అధికార యంత్రాంగం





**ప్రజాపక్షం/ఖమ్మం :**

నిలువ నీడలేక పేదవాళ్లు తలదాచుకునేందుకు చిన్న గుడిసె వేసుకుంటే చాలు పోలీస్ బూట్ల చప్పుళ్లతో ఆ ప్రాంతంలో ఒక యుద్ధ వాతావరణం నెలకొంటుంది. ఆ వెనుక చేతిలో ఫైళ్లతో రెవెన్యూ అధికారులు కారులో నుంచి సర్వే నెంబర్లు, హద్దుల కథలు వినిపిస్తుంటారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ ఎంతటి నేరమో, ఘోరమో దానికి ఎటువంటి శిక్షలు పడతాయో వివరించి ఉన్న నాలుగు సామన్లను విసిరి కొట్టి కూల్చిపడేస్తారు. మరి ధనవంతుల విషయంలో ఈ చట్టం ఎందుకు చుట్టంగా మారుతుందో అర్థం కావటం లేదు.

మిగతా 2లో..

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి





- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క
-దేశంలోనే మొట్టమొదటి సోలార్ ప్రాజెక్టు
-సమర్థ నిర్వహణలో ఆదర్శంగా నిలవాలి
- మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని వెంకటాపురంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మించిన సోలార్ పవర్ ప్లాంట్‌ను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క బుధవారం ప్రారంభించారు. ముందుగా గ్రామ చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించనున్న పెట్రోల్ బంక్‌కు భట్టివిక్రమార్క సీతక్కతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో భట్టివిక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. వెంకటాపురం గ్రామంలో


మిగతా 2లో..

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పండ్లలో రారాజు మామిడి, ఆ రారాజే ఇప్పుడు ప్రజల జీవితాల పట్ల రాకాసిగా మారుతోంది. మామిడి పండు అంటే ఇష్టపడని వారే ఉండరు. అలాంటి పండ్లను ప్రస్తుతం పరిస్థితుల్లో తింటే క్యాన్సర్ భారిన పడకతప్పదు. ఇప్పుడు మామిడి పండ్ల సీజన్ కావడంతో ఎటూ చూసినా మార్కెట్ అంతా మామిడి పండ్లే దర్శనమిస్తున్నాయి. పక్వానికి రాకముందే పండ్లను చెట్ల నుండి తెంచి కృత్రిమ పద్ధతుల్లో మాగ పెడుతూ, పండు అందగా మిళమిళా మెరిసే ఉండేందుకు మెరిసే రంగును అద్ది అమ్మకాలు సాగిస్తూ ప్రజల ప్రణాలతో చెలగాటం ఆడుతున్నారు

మిగతా 2లో..

# రంగు భలే..
# తింటే రోగాలే..!





- మార్కెంటంతా మామిడి పండ్లే..
- కృత్రిమ పద్ధతుల్లో మాగబెడుతున్న వ్యాపారులు
- పండ్లకు మిళమిళ మెరిసేరంగు
- ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం
- క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- అత్యంత ప్రమాదకరం డాక్టర్ వెంకటేశ్వరరావు

# సారూ.. స్పందించరేమి...?

(మొదటిపేజీ తరువాయి)

ధనవంతులు అక్రమిస్తే సలాం చేస్తారా వారు అక్రమిస్తే నేరం కాదా అన్న సామాన్యుని ప్రశ్నకు సమాధానం ఉండదు. ఇప్పుడు ఖమ్మం నగరంలో ఆక్రమణల పర్వం యధేచ్ఛగా సాగుతుంది. కార్పోరేషన్, రెవెన్యూ అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. ఎందుకో కానీ ఉలుకు పలుకు లేదు. ప్రభుత్వ స్థలమేగా అని వదిలేశారా, లేక పైరవీల నడుమ మనకేందుకు తలనొప్పి వద్దనుకున్నారో తెలియటం లేదు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూ కబ్జాలు ముఖ్యంగా ప్రభుత్వ స్థలాలను అక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి కబ్జాదారుల చెర నుంచి ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ఫెన్సింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతా బాగానే ఉందనుకుంటున్న దశలో గడిచిన ఆరు నెలలుగా మళ్లీ కబ్జాల పర్వం మొదలైంది. ప్రభుత్వ స్థలాలు నాగార్జున సాగర్ కాలువ కట్టలు ఇప్పుడు యధేచ్ఛగా అక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. రెండేళ్ల పాటు మౌనం వహించిన కబ్జారాయుళ్లు కాలువలు, ప్రభుత్వ స్థలాలు అక్రమించి అనుమతుల కోసం దరఖాస్తు చేస్తున్నారు. డబ్బులిస్తే దేనికైనా రెడీ అంటూ కాసుకూర్చున్న కార్పోరేషన్‌లోని కొందరు అధికారులు దొడ్డిదారిన అనుమతులు ఇచ్చే పనిలో ఉన్నారు. రాజకీయ మార్పులే కబ్జాలు ప్రారంభం కావటానికి కారణమా అన్న చర్చ జోరుగా సాగుతుంది. రెండేళ్ల కాలంలో అటు నుంచి ఇటు చాలా మంది వచ్చి చేరారు. వారిలో ఆక్రమణల చరిత్ర కలిగిన కొందరు ఇప్పుడు తమ బంధువులు, మిత్రులతో ఆక్రమణలకు తెర లేపారు. అక్రమించే వారిలో కోటీశ్వరులు తప్ప సామాన్యులు ఎవరు లేరు. అందుకే కాబోలు రెవెన్యూ, పోలీస్ కార్పోరేషన్ అధికారులు మౌనం వహిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను పేదలు అక్రమిస్తే తప్పు. సంపన్నులు అక్రమిస్తే మేము రక్షణ ఇవ్వలేం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు చేష్టలూడిగి చూస్తుండిపోతే భవిష్యత్తులో జరిగే ఆక్రమణలపై మాట్లాడే హక్కును కోల్పోతారు. ప్రభుత్వ స్థలాల రక్షణ బాధ్యతగా భావించాలి. భూమికి విలువ ఉన్న చోటే ఆక్రమణలు జరుగుతున్నాయి. ఎక్కువ భాగం ఆక్రమణలు గజం రూ. 50వేల పైచిలుకు ఉన్న చోటే జరుగుతుండటాన్ని అధికారులు గమనంలోకి తీసుకోవాలి. ప్రభుత్వ స్థలాల రక్షణ విషయంలో పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతి అన్న చందంగా కాకుండా అధికారులు వ్యవహరించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరా మహిళా శక్తి పథకం కింద నిర్మించిన ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంవ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్లాంట్ నిర్మాణంతో భవిష్యత్‌లో విద్యుత్ సరఫరా ఎంత మెరుగు పడుతుందన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతను బలమివ్వడం పథకం ముఖ్యలక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసిన అధికారులను అభినందించారు. ప్లాంట్ నిర్వహణలో ఎలా చేయాలనే దానిపై పూర్తి అవగాహన మహిళ సంఘాలకు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టుపై ఉన్న భయాన్ని పోగొట్టి నమ్మకం కలిగే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. మండల సమాఖ్య రోజు వారీ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. సీతక్క మాట్లాడుతూ ఈ ప్లాంట్ నిర్మాణంతో సమైక్య సభ్యులకు ప్రతిరోజు 12 నుండి 15వేల ఆదాయం రానున్నదని, ప్యానెల్స్ శుభ్రంగా ఉంచాలని, అన్ని నిర్వహణ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రూ.2.84కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు దేశంలోనూ రాష్ట్రంలోనూ మొట్టమొదని అన్నారు. చైతన్యమండలి మహిళా సమాఖ్యచే నిర్వహణ పకడ్బందీగా చేపట్టి రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీప్ సెక్రటరీ దానకిషోర్, సర్పు సిఇఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ దివాకర్, టిజి ఎన్పిడిఎల్ వరణ్‌రెడ్డి, స్థాని సంస్థల డిప్యూటీ కలెక్టర్ శ్రీజ, రెడ్కో సిఇఓ అనిలా, తహాశీల్దార్ సునీత, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటి ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డిఆర్‌డిఓ కొండపల్లి శ్రీరామ్, రెడ్కో డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.అజయ్‌కుమార్, డిఆర్‌డిఓ ఎపిడి జయశ్రీ, ఎడిఎ విజయచందర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, డిపిఎం శ్రీనివాస్, ఎపిఎం హరినాథ్, వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, జమలాపురం సర్పంచ్‌తుళ్లూరు నిర్మలకుమారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, చైతన్య మహిళా సంఘాల బాధ్యులు వి.జ్యోతి, రత్నకుమారి, రాధ తదితరులు పాల్గొన్నారు.

# రంగు భలే.. తింటే రోగాలే..!





(మొదటిపేజీ తరువాయి)

కాసుల కక్కుర్తి వ్యాపారులు.

**కృత్రిమ పద్దతుల్లో :** కొందరు వ్యాపారులు సంపాదనే ధ్యేయంగా విషపూర్తి రసాయాలను వాడి కృత్రిమ పద్దతుల్లో మామిడి పండ్లను మాగబెడుతున్నారు. కాల్షియం,కార్బైట్ వంటి రసాయనంతో మాగబెట్టి విక్రయాలు సాగిస్తున్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. మామిడి సీజల్లో నిత్యం తనిఖీలు చేయాల్సిన వ్యాపారులు చోద్యం చూస్తుండటంతో ప్రజారోగ్యం పతనానికి చేరుతుందనే ఆరోణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మామిడి తోటలు తక్కువే అయినప్పటికీ ఆంధ్రాలోని నూజివీడుతోపాటు పలు ప్రాంతాల నుండి రకరకాల మామిడి విక్రయానికి ఇటువైపు తీసుకొస్తుంటారు. సాధారణంగా కాల్షియం,కార్బైట్‌ను లూబ్రికెంట్స్‌గా సుమారు 2000 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకోసం వాడుతుంటారు. ఇది తమతో చర్య జరిపి ఎసిటిలీన్ అనే వాయువును విడుదల చేస్తుంది. ఇంత సెంటీగ్రేడ్‌లో విషపూర్తి రసాయనంతో మాగబెట్టిన పండ్లు తినడం అత్యంత ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తక్షణమే ఆహారభద్రత అధికారులు స్పందించి విషపూరిత రసాయనాల వాడకాన్ని అరికట్టేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా చూపుకు ఆకర్షించే విధంగా రంగులతో కనిపంచే వాటిని కొనుగోలు చేసి మోసపోవద్దని చెబుతున్నారు.

**గుర్తించండి ఇలా :** కృత్రిమంగా పండిన పండుపై తేలికపాటి మచ్చలు కనిపిస్తాయి. ఈ పండ్లను నీళ్లలో వేయడం వల్ల పేకి తేలిపోతాయి, సహజ సిద్ధమైన పండ్లు నీళ్లలో మునిగిపోతాయి. కృత్రిమ పండ్లు సహజసిద్ధమైన సువాసనతో పాటు రుచిని కోల్పోయి ఉంటాయి. కృత్రిమంగా పండిన పండ్లను సుమారు రెండు గంటల పాటు నీటిలో ఉంచడం ద్వారా వాటిలో రసాయన ప్రభావం కొద్దిమేరా తగ్గే అవకాశం ఉంది.

**క్యాన్సర్ కారకం :** కాల్షియం,కార్బైట్‌లో ఆర్గానిక్, ఫాస్పరస్ వంటి హానికరమైన విషపూర్తి సమ్మేళనం ఉంటుంది. వీటిని తినడం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటివి సంభవిస్తాయి. దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగం చుట్టుముట్టే ప్రమాదం ఉంది. జీర్ణాశయం, కాలేయం దెబ్బతింటాయి. మూత్రపిండాలు, నాడీ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.

## కృత్రిమ పండ్లు ఆరోగ్యానికి హానికరం :

**డాక్టర్ బద్దెపూడి వెంకటేశ్వరరావు**



క్యాల్షియం, కార్బైట్‌తో మాగబెట్టిన పండ్లను తినడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుంది. నరాల బలహీనత, జ్ఞాపకశక్తి మందగిస్తుంది. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధి సోకుతుంది. కృత్రి పండ్లకు బదులు సహజసిద్ధంగా మాగబెట్టిన పండ్లు తీసుకోవాలి. వరిగడ్డి, ఎండు ఆకుల, గాలి చొరబడని గదుల్లో మామిడిని పెట్టడం ద్వారా సహజసిద్ధంగా మాగుతాయి. వాటిని తీసుకుంటే ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం ఉండదు.

# నవ భారత నిర్మాత నెహ్రూ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశ తొలి ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో పురోగమనం వైపు నడిపించిన నవ భారత నిర్మాత పండిట్ జవహార్ లాల్ నెహ్రూ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వ్యవసాయ ఆధారిత సమాజంతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాన్ని ముందు వరుసలో నిలపాలని ఆయన కలలు కన్నారన్నారు. జవహార్ లాల్ నెహ్రూ 66వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ భారీ ఆనకట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఉక్కు కర్మాగారాలు సహా భారతదేశ విద్యా, వైజ్ఞానిక రంగాలకు బలమైన పునాదులు వేశారన్నారు. అణుశక్తి మిషన్‌ను ఏర్పాటు చేసి దేశాన్ని అణ్వాయుధ సంపన్న దేశంగా మార్చేందుకు ఆయన కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/వైరా:** గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలకు పెంచాలని, అర్హులైన గ్రామ దీపికలకు సిసిగా పదోన్నతి కల్పించాలని, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని, జీవో నెంబర్ 58 సవరించాలని పలు సమస్యల పరిష్కారం కోసం గ్రామదీపికలు చేపట్టిన రిలే నిరహార దీక్షలు 6వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం గ్రామదీపికల దీక్షా శిబిరాన్ని ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత, డివిజన్ నాయకురాలు కంసాని మల్లికాంబ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా వైరా డివిజన్ కార్యదర్శి గుడిమెట్ల రజిత మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలకు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామదీపికలు చేస్తున్న పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. గ్రామదీపికలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సమాఖ్యల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, మహిళల ఆర్థి, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం మహిళా సంఘాలను బలోపేతం చేయడం వంటి బాధ్యతలను గ్రామదీపికలు సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివో యూనియన్ అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి శైలజ, ఉపాధ్యక్షురాలు బబిత, షేక్ షైనాబి, ప్రభావతి, నిర్మల, మమతా, తేజ ప్రభావతి, సంజు, రమాదేవి, రాధ, మణి, మల్లీశ్వరి, విజయలక్ష్మి, స్రవంతి, గద్దె నీరజ, మేరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నాయకుడికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ఖమ్మం:** మండంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు బండారు వెంకటనారాయణ ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బండారు వెంకటనారయణ పరిస్థితి తెలిసిన సిపిఎం గ్రామ కమిటీ ఆర్థిక సాయంగా రూ.12 వేలును అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కొంగర వెంకట నారయణ మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టు పార్టీ చరిత్ర అంతా ఎందరో త్యాగాల ఫలితంగా నిర్మించబడిందని అన్నారు. అటువంటి త్యాగాల నిర్మితమైనదే ముష్టికుంట్ల సిపిఎం పార్టీ అని అన్నారు. బండారు వెంకటనారాయణ నిబద్దత కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా అనేక ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేవాడని కొనియాడారు. తన కాలాన్ని, శ్రమను పార్టీ అభివృద్ధికై త్యాగం చేసిన వెంకటనారాయణకు గ్రామ కమిటీ అండగా నిలవడం అభినందనీయమన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం, ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని కోరారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు క్రమంగా ఆర్థిక సంబంధాలుగా మారుతుండటం ఒక చేదు నిజమని అన్నారు. మనిషిలో పెరుగుతున్న స్వార్థం, డబ్బుపై వ్యామోహం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం బాధకరమన్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగానే అనేక చట్టాలు, కోడ్‌లు వచ్చాయన్నారు. దేశ ప్రజలంతా కమ్యూనిస్టులను ఆదరించినప్పుడే సమసమాజం నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కందికొండ శ్రీనివవాసరావు, గ్రామ పార్టీ కార్యదర్శి దొప్ప కొరివి, మాజీ కో అప్షన్ సభ్యులు షేక్ హస్సన్, పిల్లలమర్రి అప్పారావు, బూర్గుల అప్పాచారి, షేక్ నజీరు, దుగ్గి వెంకటేశ్వర్లు, కొమ్ము శంకర్రావు, దారగాని కృష్ణమూర్తి, షేక్ మౌలాలీ, ఆకెన నారాయణ, గుండ్లపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ఉంటే విజయం మీ వెంటే..



## ఏసిపి వసుంధర యాదవ్

ప్రజాపక్షం/సత్తుపల్లి: చదువుకు విలువ ఇస్తే భవిష్యత్తు అందంగా ఆవిష్కరించబడుతుంది. విద్యే విజయానికి మార్గమని, కష్టపడి చదివితేనే విజయం సాధ్యమవుతుందన్నారు సత్తుపల్లి ఏసీపీ వసుందర యాదవ్ (ఐపీఎస్). తెలంగాణ పాలిసెట్ ఎంట్రెన్స్2026లో 120/120 మార్కులతో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించి సత్తుపల్లి ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలబెట్టిన స్థానిక విశ్వశాంతి విద్యాలయ విద్యార్థి ఎం.డి. అర్బాజ్ అలీను గురువారం ఏసీపీ వసుందర యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది తరాల పేదరికాన్ని ఒకే ఒక్క తరంలో పోగొట్టగల శక్తి చదువుకే ఉందన్నారు. విద్య మనిషిని సాధారణ స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని. చదువుతో పేదవాడు కూడా ధనవంతుడు కావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణతో చదివితే జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. సర్బాజ్ అలీ సాధించిన ఈ ఘనవిజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయ యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, విద్యార్థి తండ్రి అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**జాగ్రత్తగా ఉండాలి : సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్**



ప్రజాపక్షం/సత్తుపల్లి: ఖమ్మం జిల్లా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గంగారంలో గల సాయిస్ఫూర్తి కాలేజీలో ఎన్‌సీసీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.ప్రస్తుతం పెరుగుతున్న ఐపీఎల్ టికెట్ బుకింగ్ మోసాలు, కొరియర్ స్కామ్‌లు, ఆన్‌లైన్ బుకింగ్ ఫ్రాడ్లు, డెలివరీ ఫ్రాడ్లు, ఇన్సూరెన్స్ ఆఫర్ మోసాలు, లోన్ యాప్ వేధింపులు, డిజిటల్ అరెస్టు మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, బ్యాంక్ కేవైసి అప్‌డేట్ పేరిట జరిగే మోసాలు, ఏపికే ఫైల్ ఫ్రాడ్లు, బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు.సైబర్ నేరాలకు ఎవరైనా గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అలాగే వాట్సప్,టెలిగ్రామ్ వంటి యాప్‌లలో అనుమానాస్పద లింకులను క్లిక్ చేయరాదని, ఓటి పిలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ సిసి11(టి) బెటాలియన్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర, లెఫ్టినెంట్ కల్నల్ విజయ్ కుమార్, పంకజ్ ధోరన్, కాలేజీ ప్రిన్సిపాల్ శేష సాయి శ్రీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం. ప్రసాద్, కానిస్టేబుల్ కృష్ణ ప్రసాద్, మహిళా కానిస్టేబుల్ వి. విజయలక్ష్మి పాల్గొన్నారు. సుమారు 500 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరై సైబర్ భద్రతపై అవగాహన పొందారు.

# నెహ్రూ ఆశయాలు చిరస్థాయిగా నిలుస్తాయి..



ప్రజాపక్షం/ మధిర : భారత దేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాత, భారతరత్న జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు ఆ మహనేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ నెహ్రూ దేశ అభివృద్ధి పునాది వేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, శాంతి సిద్ధాంతం, విజ్ఞాన సాంకేతిక రంగాల అభివృద్ధి, విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లి గొప్ప దార్శనికుడు నెహ్రూ గారేనని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్ కోసం ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పులిబండల చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మధిర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కౌన్సిలర్ బొల్లెద్దు విజయకుమారి, షేక్.హంగీర్, రంగా శ్రీనివాసరావు, జింకల కోటేశ్వరరా, సిద్ధంశెట్టి సందీప్, తోట సాయి, జమీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి

ప్రజాపక్షం/చింతకాని : డీలర్లు అందరూ విత్తన చట్టం, ఎరువుల చట్టంలకు లోబడి వ్యాపారం చేయాలని మధిర వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచందర్ సూచించారు. బుధవారం మండలపరిధిలోని నాగులవంచ రైతుల వేదికలో చింతకాని, బోనకల్ మండల డీలర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ విజయచందర్ మాట్లాడుతూ వానాకాలం సమీపిస్తున్న సందర్భంగా డీలర్లు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అమ్మాలని, విత్తన గుణగణాలు రైతులకు వివరించాలన్నారు. స్టాక్ బోర్డు ఎప్పటికప్పుడు నమోదుచేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్సై వీరేందర్, చింతకాని, బోనకల్ మండల వ్యవసాయాధికారులు సోములపల్లి మానస, వినయ్‌కుమార్, సహకార సంఘం సీఈవోలు యాలముడి శ్రీనివాసరావు, మారగాని శ్రీనివాసరావు, ఏఈవోలు కళ్యాణి, తేజ, డీలర్లు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

**- వ్యవసాయ సంచాలకులు వాణి**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన అవశేషాలను కాల్చడం వలన భూసారం తగ్గిపోతుందని, వ్యవసాయ సంచాలకులు బి. వాణి పేర్కొన్నా రు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని వెంకటగిరి, పోలేపల్లి, కొండాపురం, ఎంవీ.పాలెం, తనగంపాడు గ్రామాలలో రైతులకు పంట వ్యర్థాల దహనం, నకిలీ విత్తనాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, నిఘా సమితులపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో ఆమె మాట్లాడుతూ...నేలలోని ఉపయోగర సూక్ష్మ జీవులు నశించడం, వానపాముల సంఖ్య తగ్గిపోవడం, పర్యారణ కాలుష్యం పెరగడం జరుగుతుందని రైతులకు వివరించారు. అలాగే నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. అంతేకాకుండా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన నిఘా సమితుల ద్వారా నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడంతో పాటు పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏఓలు శరత్, అరుణ, ఏఈఓలు, ఏదులాపురం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ కందుకురి శేషమ్మ,ఏఈఓలు, పంచాయతీకార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన ఇనపనూరి మరియమ్మ(58) బుధవారం ఉదయం ఆకస్మిక మృతి చెందింది. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు. ఆమె గత 20సంవత్సరాలుగా మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తూ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందింది. ఆమె మృతి పట్ల మధ్యాహ్న భోజన పథకం ఏఐటియూసి సంఘం రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, మండల మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు ఇనపనూరి సాయమ్మ, ఎక్కిరాల మరియమ్మ, భవాని, పార్వతీ, ఆదూరి రావేలు, రాధ, లక్ష్మీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని కల్పించారు.

## విఓఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



ప్రజాపక్షం/తల్లాడ : రాష్ట్ర వ్యాప్తంగా విఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారికి కనీస వేతనాన్ని అమలు చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ దీపికలు తల్లాడలో చేపట్టిన దీక్షకు బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ దీపికలను కనీస వేతనం రూ.20వేలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. గత కొన్నిరోజులుగా గ్రామదీపికలు దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి రాయల రమేష్, పెరిక కిరణ్, మండల ట్రెజరీ యద్దనపూడి శ్రీనివాసరావు, ఉద్దగిరి రామారావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు వేమా అశోక్, యువమోర్చా నాయకులు కటికి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## డిబిఆర్ సర్కిల్లో ఉచిత మజ్జిగ పంపిణీ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని డిబిఆర్ సర్కిల్ వద్ద అఖిలభారత అయ్యప్ప గురు స్వాముల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 28వ వార్డు సిపిఐ కార్యదర్శి లగిశెట్టి రమేష్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా మజ్జిక పంపిణీ చేసి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, యువజన సంఘం సభ్యులు పేర్ల మధు, చరణ్, రాహుల్, కీరవాణి, ఎల్లాచారి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనేని చంద్రమ్మకు నివాళి



ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ : అప్పగుర్తి గ్రామంలో బుధవారం జరిగిన ప్రముఖ రాజకీయ నాయకులు వ్యాపారవేత్త ఎస్.నాగేశ్వరరావు మాతృమూర్తి శ్రీరామినేని చంద్రమ్మ దశదిన కార్యక్రమానికి మధిర మండల కాంగ్రెస్ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, నిడమానూరు వంశీకృష్ణ,మోదుగుబాబు, ప్రముఖ వ్యాపారవేత్త ఈఢర సుబ్బారావు, చిలుకూరు గ్రామశాఖ అధ్యక్షులు రావిరాల సత్యనారాయణ, అనంత మల్లయ్య, మట్టూరి దుర్గ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకు గంతలు కట్టుకొని గ్రామదీపికల నిరసన



ప్రజాపక్షం/చింతకాని : సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని గ్రామదీపికల సంఘం చింతకాని మండల కార్యదర్శి బి అరుణ పేర్కొన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఓ 58ని సవరించడమే కాకుండా సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళల ఆర్థిక అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్న విఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఇప్పటికైనా స్పందించి వివోఏల డిమాండ్లను అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విఓఏలు ధనలక్ష్మి , నాగమణి, నాగరాణి, పుష్ప, సైదులు, నాగేశ్వరి, రాజు, హైమారావు, ధనలక్ష్మి , గీత, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల విజయాలు జిల్లాకు గర్వకారణం : ఐటిడిఎ పిఓ



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు పది, ఇంటర్, జేఈఈ, ఎఫ్‌సెట్ పరీక్షల్లో చక్కటి ఫలితాలు సాధించడం జిల్లాకే గర్వకారణమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రతిభా సత్కార కార్యక్రమంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రతిష్టను పెంచారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువుల కృషికి విద్యార్థుల విజయాలే నిజమైన గుర్తింపు అన్నారు. ఇంటర్ దశ నుండే కెరీర్‌పై దృష్టి సారించి ఎంసెట్, నీటి, జేఈఈ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధంకావాలన్నారు. వివిధ పరీక్షల్లో ఉత్కృత్తమ మార్కులు సాధించిన బాలబాలికలను పిఓ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, ప్రిన్సిపల్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : ఓటర్లు తన ఓటు మ్యాపింగ్ ప్రక్రియను జూన్ 10వ, తేదీలోపు పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ దారా ప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రజాపక్షంతో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) వచ్చే నెల 25వ, తేదీ నుండి ప్రారంభమవుతుందన్నారు. దానిలో భాగంగా మండలంలోని ఓటర్లు 2002 సంవత్సరంలో నివాసం కలిగి ఉన్న ప్రాంతంలో నమోదు చేసుకొన్న ఓటుహక్కుకు సంభంధించిన 2002 సంవత్సరంలో ఉన్నటువంటి నియోజకవర్గం నెంబర్, పోలింగ్ కేంద్రం నెంబర్ మరియు క్రమ సంఖ్య తదితర వివరాలను ప్రస్తుతం నివాసం కలిగి ఉన్న ప్రాంతంలో ఓటరు మ్యాపింగ్ చేసుకొనుటకు వివరాలను తీసుకొని సంభంధిత బూత్ స్థాయి అధికారిని సంప్రదించి వెంటనే మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఓటరు జూన్ 10వ, తేదీలోపు మ్యాపింగ్‌ను పూర్తి చేసుకోవాలని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలం రామానుజవరంలో స్కూటీపై వెళుతున్న మహిళకు రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిర్లాపురం ప్రధాన రహదారిపై గేదెలు అడ్డు రావడంతో ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పగిడేరు గ్రామానికి చెందిన యువతి తిర్లాపురం పెట్రోల్ బంకులో విధులు నిర్వహిస్తుంది. డ్యూటీకి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ఏన్కూరు: మండలంలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారి పల్లి భాగ్యశ్రీ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందస్తు గాలివానలు, భారీ వర్షాల సమయంలో వాగులు, చెరువుల వద్ద ప్రజలు వెళ్లకుండా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, ఎంఈఓ నాగిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు బాలకృష్ణ, ఏవో నరసింహారావు, పంచాయితీ రాజ్ ఏఈ సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు భవాని, బక్కమ్మ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరం



ప్రజాపక్షం/ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యాధికారి సదానందం 61 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 12 మంది రోగులకు కాంట్రాక్ట్ ఆపరేషన్ కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రిఫర్ చేసినట్లు కంటి వైద్యులు సదానందం తెలిపారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్, సూపర్వైజర్ గోపాలకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాపక్షం/చుంచుపల్లి : అకాల వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో సుమారు 1200 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి, వాటిని సుజాతనగర్‌లోని రైస్ మిల్‌కు రెండు రోజుల్లోపు తరలింపు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీరు ధాన్యం నిల్వల వద్ద చేరకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొఉనగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్, రవాణా పనులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రైతులకు కేంద్రాల్లో తాగునీరు, నీడ, సదుపాయాలు వంటి అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సీఓ ప్రేమ్ కుమార్, డిఎం సతీష్, చుంచుపల్లి తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుభాషిని, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివోఏ, ఐకెపి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**-ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి**
**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**



ప్రజాపక్షం/మణుగూరు: వివోఏ, ఐకెపి కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని, మణుగూరు ఐకెపి కార్యాలయం ముందు వివో ఏఐకె పి కార్మికులు సంయుక్తంగా రిలే దీక్షలు చేస్తున్న వీరిని సిపిఐ నాయకులు సందర్శించి తమ దీక్షలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఐకెపి, వివో ఏలు గ్రామాలలో ప్రభుత్వ స్కీం లలో పనిచేస్తున్నారని గత ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవితాలు సరిపోవడం లేదని ఆందోళన చేసినప్పుడు, ఇప్పుడు ఉన్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరికి కనీస వేతనం 20 వేల రూపాయలకు పెంచుతావని హామీ ఇచ్చిందని ఇచ్చిన హామీ అమలు చేయాలని, వీరు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఆందోళన న్యాయమైనదని కావున వీరికి కనీస వేతనం అమలు చేయాలని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని, తదితర డిమాండ్స్ ను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఇస్తున్నటువంటి గౌరవ వేతనం ఎటు సరిపోవడం లేదని, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని ఇల్లు గడిపే పరిస్థితి సామాన్య కుటుంబాలకు లేదని, పొద్దున దాకా పనిచేసే జీతం లేక అప్పుల పాలు కావలసిన పరిస్థితి వస్తుందని, కావున ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీని అమలు చేయాలని కనీస వేతనం 20000 ఇచ్చిన హామీ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అన్నింటిలో వారు భాగస్వామ్యం అవుతున్నార ని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారనీ ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మీ ఆందోళనకు సిపిఐ, ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్కె సర్వర్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, గోపిశెట్టి శివయ్య, ఆధర్ల రాములు, ఎం. రమేష్, వెంకటేశ్వర్లు, మరియు పిఓఏ ఐకెపి కార్మికులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అడ్డంకిగా సివిల్ స్కోర్..!

**-దరఖాస్తు చేసిన నిరుద్యోగుల్లో 90శాతం మందికి నిరాశ**
**-కూసుమంచి ఎస్‌బిఐ మేనేజర్ కఠిన నిబంధనలు**
**- ఎస్సీ పేద, నిరుద్యోగ యువకుల్లో తీవ్ర అసంతృప్తి**




ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలో ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోలు మంజూరు పథకం పేద నిరుద్యోగ ఎస్సీ యువతకు ఆశాజ్యోతి కావాల్సి ఉండగా, బ్యాంకులు సివిల్ స్కోర్ నిబంధనలతో ఆ ఆశలు ఆవిరవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ, కూసుమంచి ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ ఎన్ శ్రీనివాస్ కఠిన ప్రమాణాల కారణంగా నూటికి 90శాతం మందికి పైగా అర్హత కోల్పోతున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది పేద కుటుంబాలకు గతంలో తీసుకున్న చిన్నపాటి రుణాలు, ఫైనాన్స్ బకాయిలు, కరోనా కాలంలో చెల్లింపుల ఆలస్యం వంటి కారణాలతో సివిల్ స్కోర్ తగ్గిపోయింది. దీంతో ప్రస్తుతం సబ్సిడీతో వచ్చే రుణాలకు కూడా బ్యాంకులు తిరస్కరణ తెలుపుతున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పథకాలు తీసుకొస్తే, బ్యాంకులు మాత్రం కార్పొరేట్ రుణాల మాదిరిగా కఠిన నిబంధనలు పెడుతున్నాయి అంటూ పలువురు నిరుద్యోగ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూసుమంచి మండలంలో దరఖాస్తులు చేసిన పలువురు అభ్యర్థులు ఇప్పటికే అన్ని ధ్రువపత్రాలు సమర్పించినప్పటికీ, చివరి దశలో సివిల్ స్కోర్ కారణంగా తిరస్కరణకు గురవుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఉపాధి పథకాలు నిజంగా పేదలకు అందాలంటే బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరో వైపు, గ్రామీణ పేదలకు సివిల్ స్కోర్‌పై సరైన అవగాహన కూడా లేదని స్థానికులు అంటున్నారు. కొందరి పేర్లపై తెలియకుండానే పెండింగ్ ఫైనాన్స్‌లు, పాత మొబైల్ లోన్లు, చిన్న రుణాలు ఉండటంతో వారు అనర్హులవుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ పథకాలు ప్రకటించడం ఒకటి, వాటిని నిజంగా పేదలకు అందించకపోవడం మరోకటి అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై స్పందిస్తూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని, సివిల్ స్కోర్‌ను పూర్తి స్థాయి ప్రమాణంగా పరిగణించవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలంటే బ్యాంకింగ్ నిబంధనల్లో సడలింపులు తీసుకురావాలని, లేకపోతే పథకం కాగితాలకే పరిమితమవుతుందని హెచ్చరిస్తున్నారు.

**ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాస్ వివరణ.....**

సివిల్ స్కోర్ లేని కారణంగా తిరస్కారణకు గురవుతున్న దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటని అందులో పేదలు, నిరుద్యోగులు ఉన్నారని వారి పరిస్థితి ఏమిటని ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా కూసుమంచి ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మేము చేయగలిగేది ఏమీ లేదు ప్రభుత్వ నిబంధనలో అలా ఉన్నాయి, కంప్యూటర్‌లో ఏ విధంగా ఉందో దానినే మేము ఫాలో కావాల్సి ఉంటుందని, మేము మార్పు చేసేది కూడా అక్కడ ఏమి లేదు, చేయగలిగేది కూడా ఏమీ లేదు అని తెలిపారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**- భక్తి,దాతృత్వం,సోదరభావాన్ని చాటే పవిత్ర వేడుక**
**- నేడే బక్రీద్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : త్యాగం, దాతృత్వం, త్యాగానికి ప్రతీకగా నిలిచే పండుగ బక్రీద్. అలాంటి పండుగను ముస్లీం కుటుంబాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈవేడుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లీం కుటుంబాల వారు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**త్యాగస్ఫూర్తికి గుర్తుగా :** అల్లా ఆజ్ఞాతో తమ కుమారున్ని త్యాగం చేయడానికి సిద్ధమైన ప్రవక్త ఇబ్రహీం భక్తి విశ్వాసాన్ని స్మరించుకుంటూ బక్రీద్‌ను జరుపుతారు. అల్లా కరుణతో కుమారుని స్థానంలో జంతువును బలి ఇవ్వాలని ఆదేశించడంతో కుమారుని స్థానంలో జంతువును బలి ఇచ్చారని విశ్వాసం ముస్లీంలో ఉంది. దేవుడి మాటకు లోబడి కుమారున్ని సైతం త్యాగం చేయడానికి ఇబ్రహీం ముందుకు రావడంతో ఈ పండుగను త్యాగాల పండుగగా కూడా పేర్కొంటారు.

**ప్రత్యేక ప్రార్థనలు :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు సామూహిక వేడుకలను జరిపిస్తారు. ఈద్గా మైధానాల్లో ప్రత్యేక నమాజ్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంగా కుటుంబాలు, బంధువులు ఏకమైన పండుగను జరుపుకుని ఆనందోత్సహాలంతో గడుపుతారు.

**దాతృత్వానికి పెద్దపీట :** బలి ఇచ్చిన జంతువుల మాంసాన్ని పేదలు, బంధువులు, అవసరమైన వారికి పంచడం బక్రీద్ ప్రత్యేకత. సమాజంలో సమానత్వం, సహకారం, మానవత్వం పెంపొందించడమే ఈ పండుగ ప్రధాన ఉద్దేశని ముస్లీం మత పెద్దలు పేర్కొంటారు. పండుగను పురస్కరించుకుని మార్కెట్ సందడిగా మారింది.

**శాంతి, సోదర భావానికి సందేశం :** బక్రీద్ పర్వదినం త్యాగం మాత్రమే కాకుండా ప్రేమ, శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోంది. మతం భేదాలకు అతీతంగా ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సామరస్య పూర్వక వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు.

# భారీ గాలి దుమారంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



ప్రజాపక్షం/చుంచుపల్లి : చుంచుపల్లి మండలం ధన్‌బాద్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వచ్చిన భారీ గాలి దుమారం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బలమైన ఈదురు గాలులకు ఓ భారీ చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో 10 విద్యుత్ స్తంభాలు నేలకూలాగా, మరికొన్ని స్తంభాలు విరిగిపోయాయి. అదేవిధంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కిందపడిపోయాయి. అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతు పనులు ప్రారంభించారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు కలసి చెట్టును తొలగించే పనులు చేపట్టారు. సింగరేణి ప్రాంతం కావడంతో ఆ చెట్టు దగ్గరలో సింగరేణి విద్యుత్ వైర్లు ఉండడంతో సింగరేణికి సంబంధించిన ఎస్సీ క్వార్టర్స్, ఎర్రగడ్డ కొన్ని ప్రాంతాల్లో సింగరేణి ఎలక్ట్రికల్స్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. ఈ ఘటన కారణంగా గౌతంపూర్, రుద్రంపూర్, ధన్‌బాద్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 4 గంటల నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సాయంత్రం 7 గంటల వరకు సమయం పట్టే అవకాశముందని డీఈ రంగస్వామి, ఏఈ లక్ష్మీ నరసింహారావు తెలిపారు. లైన్‌మెన్లు కిషన్, సాంబశివరావు సంఘటనా స్థలంలోనే ఉండి మరమ్మత్తు పనులను పర్యవేక్షిస్తున్నారు.

# అక్రమంగా తరులుతున్న బెల్లం, పటిక పట్టివేత

**ఇరువురి అరెస్ట్.. కారు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం**




ప్రజాపక్షం/నేలకొండపల్లి : నాటు సారా తయారీ కి ఉపయోగించే ముడి సరుకు పదార్థాలను అక్రమంగా తరలిస్తుండుగా పట్టుకుని, ఇరువురు వ్యక్తులను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ లోని గుంటూరు నుంచి తెలంగాణ లోని మహబూబాబాద్ జిల్లా కు అక్రమంగా సారా తయారీ కి ఉపయోగించే బెల్లం 500 కేజీల, 50 కేజీల పటిక లను కారులో తరలిస్తుండుగా, స్థానిక ఎక్సైజ్ పోలీసులు ముదిగొండ మండలం లోని వల్లభి గ్రామం వద్ద తనిఖీలు చేస్తున్న సందర్భంగా పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లా లోని పలు తండాలకు నాటు సారా తయారీ కి అవసరమైన ముడి సరుకు ను గుంటూరు నుంచి సరఫరా చేస్తున్నారు. కారు లో మహబూబాబాద్ జిల్లా కు చెందిన కర్లపాటి స్వామి, ఎస్.యాకూబ్ లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కారు తో పాటు రెండు సెల్ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు.

# రైతులు అధైర్యపడొద్దు

**- చివరిగింజ వరకు కొనుగోలు**
**- మండల వ్యవసాయాధికారి శంభో శంకర్**



ప్రజాపక్షం/పాల్వంచ : రైతులు అధైర్యపడొద్దని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆందోళనకు గురై దళారులను ఆశ్రయించి పోసపోవద్దని మండల వ్యవసాయాధికారి శంభో శంకర్ అన్నారు. మండల పరిధి ఉల్వనూర్ మొక్కజొన్న, కారెగట్టు, సోములగూడెంలలోని దాన్యం కొనుగోలు కేంద్రాలను బుదవారం సంధర్శించారు. దాన్యాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఏడు దాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి మూసి వేశామని చెప్పారు.ఉల్వనూరులోని మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం నుండి 1248 మెట్రిక్ టన్నుల మక్కలను గోదాముకు తరలించామన్నారు. మరో 100 మెట్రిక్ టన్నులు స్టాక్ ఉన్నాయని త్వరలోనే వాటిని గోదాము తరలిస్తామని తెలిపారు. సోములగూడెం దాన్యం కొనుగోలు కేంద్రంలో మూడు లారీలు, కారెగట్టులో రెండు లారీలకు సరిపడా దాన్యం ఉందన్నారు. వీటిని కూడా త్వరలో పంపించి కొనుగోలు కేంద్రాలను మూసి వేస్తామని అన్నారు. మొత్తం 17100 కింటాళ్ళ దాన్యం కొనుగోలు చెశామని పేర్కొన్నారు. రైతులు తోదరపడి దళారులను ఆశ్రయించి నష్టానికి గురికావద్దని హెచ్చరించారు.

# శాంతియుంతంగా బక్రీద్ జరుపుకోవాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కాంగ్రెస్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు, ముస్లిం మైనార్టీ సంక్షేమ సమితి అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ కోరారు. పండుగ సందర్భంగా చట్టాలను గౌరవించాలని, ఆవులు, దూడల అక్రమ రవాణా, వధకు దూరంగా ఉండాలని సూచించారు. కుర్బానీ కోసం చట్టబద్ధంగా అనుమతించిన జంతువులను మాత్రమే వినియోగించాలని తెలిపారు. జంతువుల రవాణాలో అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. పరమత సహనంతో ఎలాంటి ఘర్షణలకు తావివ్వకుండా జిల్లాలో సౌభ్రాతృత్వ వాతావరణాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

# గిరిజన సంఘం మండల మహాసభలో నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామ పంచాయితీలో గల రాజీవ్‌నగర్‌లో గిరిజన సంఘం మండల మహాసభ సబ్కం నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్వ వెంకటేశ్వర్లు, పాల్వంచ మండల కార్యదర్శి ఈసశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, నాయకులు సిద్ధాపు సుబ్బారెడ్డి, చారి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా గిరిజన సంఘం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎట్టి భద్రం, ఉపాధ్యక్షులుగా కొమరం రాజేష్, మడకం నికిత, కార్యదర్శిగా కుంజా భద్రం, సహాయ కార్యదర్శులుగా సోడే ముత్తయ్య, మడివి సోని, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుంజా నాగరాజ్, కోశాధికారిగా ఏకో వినోద్ ఎన్నికయ్యారు. అలాగే 29 మంది కౌన్సిల్ సభ్యులు, 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వలస ఆదివాసీ గ్రామాలకు రోడ్లు, కరెంట్, మంచినీటి వంటి మౌలిక వసతులు కల్పించాలి, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. పోడు రైతుకలు రైతుబంధు అందించి సాగునీటి సౌకర్యం కల్పించాలని తీర్మానాలు చేశారు.


# ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/కారేపల్లి: ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ సింగ్ సూచించారు. బుధవారం కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. ఉదయం వేళల్లో పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం సమయంలో బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై వైద్య సేవలపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో రామారావు, అడిషనల్ డీఎంహెచ్‌వో చందు నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వేణుమాధవ్, ప్రదీప్, మండల వైద్యాధికారి భూక్యా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# గోతిలో పడి దుక్కిటెద్దులు మృతి

**- గోధుమవాగులో అక్రమ ఇసుక తవ్వకాలు**



ప్రజాపక్షం/చుంచుపల్లి : చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి గ్రామ పంచాయతీ వద్ద గోధుమవాగులో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సిద్దల వెంకన్న ఎడ్లబండిపై ఇసుక తీసుకురావడానికి వాగులోకి వెళ్లగా నీటితో నిండిపోయిన లోతైన గోతిని గుర్తించకపోవడంతో బండి అదుపుతప్పి గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో రెండు దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందగా, రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం గోధుమవాగులో నిత్యం ఎడ్లబండ్లపై అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతూనే ఉందని, అదేవిధంగా నిరంతర ఇసుక తవ్వకాల వల్ల వాగులో ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి ఆరోపిస్తున్నారు. వాగులో నీటితో నిండిపోయి ఈ గోతులు బయటకు కనిపించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి తెలిపారు. ప్రతిరోజూ గ్రామస్తులు, రైతులు వాగు దాటుతూ రాకపోకలు సాగిస్తుండగా ఇలాంటి ప్రమాదకర గోతులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. అధికారులకు అక్రమ ఇసుక తవ్వకాల విషయం తెలిసినా పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వాగు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి ప్రమాదకర గోతులను పూడ్చివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజల హృదయాలను గెలిచిన నాయకుడు మదన్‌లాల్

**-నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించిన నేత**
**-తండ్రి ఆశయ సాధనలోనే తనయ**







**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు స్వర్గీయ బానోతు మదన్‌లాల్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వైరాలో ఇండోర్ స్టేడియం సమీపంలో వర్ధంతి కార్యక్రమాన్ని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళి అర్పించారు. ఈ వర్ధంతి సభలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మదన్‌లాల్ కూతురు మనీషా లక్ష్మి, వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు చిలకా కోటయ్య, దొంతిబోయిన వెంకటేశ్వర్లుతో పాటు బిఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వర్ధంతి సభలో మదన్‌లాల్ కూతురు మనీషా లక్ష్మి మాట్లాడుతూ నిరంతరం ప్రజల హృదయాల్లో మనసు సంపాదించుకున్న నా తండ్రి చూపించిన మార్గంలోనే తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజా సేవకే అంకితం అవుతానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో మదన్‌లాల్ వేసిన పునాది నేటికి చెక్కుచెదరలేదని మనీషా లక్ష్మి అన్నారు. కట్టా కృష్ణార్జునరావు మాట్లాడుతూ మదన్‌లాల్ మరణం నియోజకవర్గానికి తీరని లోటు, నేటికి బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గంలో బలంగా ఉందని, మదన్‌లాల్ వైరా నియోజకవర్గంలో ప్రతి మూల గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపించిన మహా నాయకుడు అని అలాంటి నాయకుడు ప్రజల నుంచి దూరం కావడం బాధాకరమని అన్నారు. వనమా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల హృదయాలను గెలుచుకున్న మహా నాయకుడు మదన్‌లాల్, ఆయన ఆశయ సాధన కోసం పార్టీ నాయకులు కృషి చేయాలని తెలిపారు. బాణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని ప్రజలను పేరుపేరునా పిలిచే మహోన్నత వ్యక్తి మదన్‌లాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పం సురేష్, మాదినేని దుర్గాప్రసాద్, షేక్ లాల్‌మహ్మద్, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, ఏదునూరి శ్రీనివాసరావు, కారుకొండ బోస్, కందుల ఓంకార్, పొరుపల్లి నాగం, తన్నీరు నాగేశ్వరరావు, ఆదూరి ప్రేమ్, బట్టా భద్రయ్య, దారెల్లి పవిత్రకుమారి, బొడ్డు రామకృష్ణ, దొంతిబోయిన చింతయ్య, మదుపల్లి కృష్ణ, మన్నెం సత్యానందం, నల్లగొండ నాని, బండారు శ్రీను, తన్నీరు కిషోర్,వల్లెపు రాము, దాసరి శ్రీనివాసరావు, ముదిగొండ వెంకటనారాయణ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.


# భారంగా మారిన పేద, మధ్య తరగతి ప్రజల జీవనం

**సీపీఐ నేత దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల జీవనం రోజు, రోజుకూ భారంగా మారిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ విమర్శించారు. మండల పరిధిలోని రామానగరంలో బుధవారం నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. పెరుగుతున్న ధరలతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జీఎస్టీ పేరుతో ప్రజలపై అదనపు భారాలు మోపుతూ, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశభక్తి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, సామాన్యుల సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం రోజు,రోజుకూ పెరుగుతూ యువతకు ఉపాధి అవకాశాలు కరవవుతున్నాయని, దీంతో యువత తీవ్ర ఆందోళనకు గురవుతోందన్నారు. మరోవైపు రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు లేక, ఎరువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గం జీవనోపాధి సంక్షోభంలో చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పాలకుర్తి వీరయ్య, దండు జగన్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సాయి, కొండయ్య, రవీంద్ర, షడక్కు ప్రభాకర్ పాల్గొన్నారు.

## వడదెబ్బకు వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/టేకులపల్లి :** వడదెబ్బ తగిలి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సులనగర్‌లో బుధవారం జరిగింది. సూరేపల్లి జయరామయ్య (62) తీవ్రమైన ఎండలకు వడదెబ్బకు గురయ్యారు. వడదెబ్బతో ఇబ్బందులు పడుతున్న అతన్ని ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందించారు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన అనంతరం వాంతులు, విరోచనాలయ్యాయి. తిరిగి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. జయరామయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో
# తాగునీటి కుండలు ఏర్పాటు

**-హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**






**ప్రజాపక్షం/వైరా:** ప్రభుత్వ కార్యాలయాల్లో త్రాగునీటి కోసం మట్టి కుండలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రజాపక్షం దినపత్రికలో ప్రభుత్వ కార్యాలయాల్లో మట్టి కుండల ఏర్పాటు ఎక్కడా అనే శీర్షికను బుధవారం ప్రచురించడం జరిగింది. ఎండ తీవ్రత విపరీతంగా ఉండటంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు త్రాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలో 46 డిగ్రీలు కూడా దాటుతున్నాయి. ప్రభుత్వ అధికారులు మంచినీటి కోసం కుండలు ఏర్పాటు చేయకపోవడంతో త్రాగునీటి కోసం పరిగెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కథనంతో స్పందించిన వైరా మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపిడిఓ సక్రియ త్రాగునీటి కుండలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా త్రాగునీటి కోసం కుండలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజాపక్షం కథనంతో అధికారులు స్పందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## భరతనాట్య ప్రతిభా పాటవ పరీక్షలు

**-హాజరైన పలువురు విద్యార్థినిలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భరత నాట్యంలో ప్రతిభా పాటవ పరీక్షలను బుధవారం ఖమ్మంలో నిర్వహించారు. ప్రాచీన కళా కేంద్రం ఛండీఘర్ విశ్వ విద్యాలయంలో డిగ్రీ కోర్సులో భాగంగా ఖమ్మం నగరానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయం విద్యార్థినిలకు పరీక్షలు నిర్వహించారు. ప్రారంభిక 1, ప్రారంభిక 2, భూషణ్ 1, భూషణ్ 2 విభాగాల్లో 50 మంది విద్యార్థినిలు వ్రాత, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారు. ఛండీఘర్ విశ్వ విద్యాలయం నుంచి డా॥ ప్రతిమా సునీల్ పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు. విద్యార్థినిలు భరతనాట్యంలోని మేళకువలను చక్కగా ప్రదర్శించడంతో పాటు నాట్యంలోని పలు అంశాలను ప్రదర్శించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ధృవపత్రాలను డిగ్రీని ప్రధానం చేయనున్నట్లు ప్రతిమా సునీల్ తెలిపారు. నాట్య గురువు కణతాల ఫణిల్ ఆధ్వర్యంలో విద్యార్థినిలు ప్రతిమా సునీల్‌ను శాలువతో సత్కరించారు.

## అంబేడ్కర్ సెంటర్‌ను ఆధునీకరించండి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం, వైరా ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్‌కు సమీపంలోని అంబేడ్కర్ సెంటర్‌ను ఆధునీకరించాలని కాంగ్రెస్ నాయకులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వినతి పత్రం సమర్పించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫౌంటెన్‌తో పాటు ఇనుప మెట్లను ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాన్ని సుందరంగా ఆధునీకరించాలని కోరారు. కోరిన వారిలో మురళీ, రఫీషేక్, సుందర్‌రావు, రతన్ రాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## అభ్యుదయ వాది వీరేశలింగం గృహ సందర్శన



**ప్రజాపక్షం/ఖమ్మం :** అభ్యుదయ వాది సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన ప్రముఖులు రాజమహేంద్రవరంలోని వీరేశలింగం స్వగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గజ్జె తిక్కన్నగా పేరొందిన వీరేశలింగం పలు సంఘ సంస్కరణలకు నాంది పలికారన్నారు. తెలుగు సాహిత్య రంగంలో అద్భుత సేవలు అందించారని హితకారిణి సమాజం వివేక వర్ధని పత్రిక ద్వారా తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వితంతు వివాహాలు, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన కోసం ఆయన పని చేశారన్నారు. సందర్శించిన వారిలో రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షులు డా॥ దుర్గాప్రసాద్, వివిధ కళాశాలల గ్రంథపాలకులు, డా॥ విజయ్‌కుమార్, డా॥ రవికుమార్, నాగరాజు, సిహెచ్ మల్లేశం తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఇరువురికి గాయాలు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం, వేంసూరు మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే వేంసూరు గ్రామానికి చెందిన నాయుడు ప్రశాంత్ (56) ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో నాయుడు ప్రసాద్ అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. తక్షణమే స్థానికులు 108 కు సమాచారం అందించి, సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో బాధిత కుటుంబం ఫిర్యాదు చేసిన అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. అయితే కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు నాయుడు ప్రసాద్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు పూనుకున్నారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

## డ్రైనేజీలు శుభ్రంగా ఉంచడం మన బాధ్యత



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో డ్రైనేజీ పూడికతీత పనులు బుధవారం చేపట్టారు. గత కొన్ని రోజులుగా డ్రైనేజీలో పూడిక ఉండటం వలన వర్షాలకు నీరు రోడ్లు పైకి వస్తున్న విషయాన్ని కౌన్సిలర్ సునీత ప్రసాద్ మున్సిపాల్ అధికారులకు వివరించారు. జేసిబిని పంపించి డ్రైనేజీ క్లీన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు డ్రైనేజీలను శుభ్రంగా ఉంచేవిధంగా చూడాలని, చెత్తను డ్రైనేజీలు వేయవద్దని ప్రజలకు సూచించారు.

# పిహెచ్‌సిలో సాధారణ కాన్పులు పెంచాలి

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా॥ తుకారాం రాథోడ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, గర్భిణీల రిజిస్టర్లు, టీకాల కార్యక్రమ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణీలకు ఈ.డి.డి. క్యాలెండర్ ప్రకారం ప్రసవ తేదీలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి గర్భిణికి కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. గర్భిణీలు ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని, పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ కాన్పుల శాతాన్ని పెంచేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తల్లి మరియు శిశు మరణాలను తగ్గించేందుకు హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని పేర్కొన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రాబోయే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి మైక్రో ప్రణాళికను సిద్ధం చేసి, ఐదేళ్ల లోపు పిల్లల లైన్ లిస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఇంటింటికి వెళ్లి 0 నుండి 5 సంవత్సరాల పిల్లల కోసం సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రజలు పరిశుభ్రత పాటించడం, మరుగుదొడ్లు వినియోగించడం, చేతులు సబ్బుతో కడుక్కోవడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ ఎంఎల్పిహెచ్ రాధిక, హెచ్వి నర్సింగ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

# వివోఏల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/కల్లూరు:** వివోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించి ఆర్ఐ వర ప్రసాద్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వివోఏ ల గౌరవ అధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ మండల సమాఖ్య కార్యాలయం ఎదుట గత పది రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె సందర్భంగా గత 22 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న వివోఏ లకు నెలకు కేవలం 5000 రూపాయలు మాత్రమే ఇవ్వడం దారుణమని అన్నారు. వివో ఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26,000 అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని సాధారణ, ప్రమాద, బీమా సౌకర్యం 20 లక్షలు కల్పించాలని, 58 జీవోను సవరించాలని, లేనిచో రాష్ట్రంలోని 18 వేల మంది తో




ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వివోఏల సంఘం అధ్యక్షులు వేము నాగమణి, ఉపాధ్యక్షులు కే నీలవేణి, మల్లిక, రమాదేవి, విజయలక్ష్మి, దేవమణి, వెంకట రావమ్మ, అరుణ, జ్యోతి, మాధవి పాల్గొన్నారు.

# రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేసిన వివోఏలు




**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పనికి తగిన కనీస వేతనం అమలు చేయాలని మే 18నుంచి వివోఏలు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో వివోఏలు రోజుకొక విన్నూత రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆరవరోజు దీక్షలో రోడ్డుపై వంటావార్పు చేసి వివోఏలు అంతా దీక్షా శిబిరంలోనే భోజనాలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివోఏల జెఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ వివోఏల బతుకులు రోడ్డుపై పడవేయకుండా వెంటనే ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి స్పందించి వివోఏలకు కనీస వేతనం అమలు చేసి తమను ఆదుకోవాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం నిత్యం స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవితాల్లో వెలుగులు నింపే వివోలకు మాత్రం కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారి కుటుంబాలను బజారుకు ఈడుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివోఏల పట్ల సానుకూలంగా స్పందించి వివోఏలకు రూ.20వేలు వేతనం అమలు చేసి నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో వేతనాన్ని జమ చేయాలని ఆమ కోరారు. 57ఏళ్లు దాటిన వివోఏలకు ఫెన్షన్లు ఇన్సూరెన్స్ బీమా సౌకర్యం వివోఏల కుటుంబాలకు హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత, హెచ్ఆర్‌సి పాలసీ అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏల జెఏసి జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిళ్ళ ఉమా, మండాది కళమ్మ, పోలూరి విజయలక్ష్మి, బొడ్డు కుసుమ, మాధురి, మేకల కృష్ణవేణి, ధనలక్ష్మి, మెట్టు స్వరూప, కవిత, కుమారి, రమణ, పద్మ, సామినేని కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మి, సిహెచ్.జ్యోతి, ధనలక్ష్మి, సరిత, సునీత, అనూష తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో నీటిని తీస్తే చర్యలు తప్పవు

**ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చెరువు లలో చేపల వేట కోసం నీటిని విడుదల చేస్తే చర్యలు తప్పవని నేలకొండపల్లి ఇరిగేషన్ డీఈఈ మనధ్మధరావు హెచ్చరించారు. మండలం లోని మంద్రాజుపల్లి, నేలకొండపల్లి కట్టలమ్మ చెరువు నీటిని తరలించే విషయం పై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో బుధవారం చెరువు వద్ద కు వెళ్లి చెరువు నీటి విడుదల కోసం తీసిన యూటీలను తిరిగి బంద్ చేయించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడారు. చెరువులలో నీటి ని అక్రమంగా తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తే వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువు నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందని పేర్కొన్నారు. మత్స్య సొసైటీ పాలకవర్గాలతో పాటు, స్థానిక రైతులు కూడ నీటిని కాపాడుకోవాలని సూచించారు. ఎక్కడైనా నీటిని అక్రమంగా తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. చెరువు నీటిని కాపాడేందుకు ఇరిగేషన్ సిబ్బందీ ని రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువులలో నీటిని తరలించకుండా రాత్రి, పగలు తమ సిబ్బంది కాపాలా కాస్తున్నారని పేర్కొన్నారు. చెరువులలో నీటి ని అక్రమంగా విడుదల చేస్తున్నారని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా నీటిని విడుదల చేయకుండా సొసైటీ పాలకవర్గాల సభ్యులకు సూచనలు చేయాలని ఫిషరీష్ అధికారులకు లేఖలు వ్రాసినట్లు తెలిపారు. తూముల మీద చేయ్యేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఇరిగేషన్ జేఈలు నరేష్, మధీన, సిబ్బంది పాల్గొన్నారు.

# గార్ల ఒడ్డులో కొబ్బరి మొక్కలు దగ్ధం

**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని గార్ల ఒడ్డు గ్రామంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు వరి పొలాల్లో నిప్పంటించడంతో వరిగడ్డితో పాటు కొబ్బరి మొక్కలు కాలిపోయాయి. రైతు భూక్య లాలు సాగు చేస్తున్న సుమారు మూడు ఎకరాల పొలం గట్లపై నాటిన సుమారు 100 కొబ్బరి



మొక్కలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే వ్యవసాయానికి ఉపయోగించే పైపులు, మోటారు, స్టార్టర్ కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే వ్యవసాయ అధికారి నరసింహారావు, పోలీసు సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతుకు తక్షణ నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/పినపాక:**పాండురంగాపురం పంచాయితీ ఇప్పలగుంపు గ్రామానికి చెందిన గొగ్గల అబ్బయ్య, గొగ్గల కృష్ణ ఇళ్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న జగ్గారం గ్రామ పంచాయితీ సర్పంచ్ గొగ్గల సుహాసిన బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచారు.



బాధితులకు 50కేజీల బియ్యం, దుప్పట్లు, చీరలు, ఉప్పులు, పప్పులు, నూనె ప్యాకెట్లు, సబ్బులు తదితర నిత్యావసర వస్తువులతో పాటు రూ 1000 నగదు సహాయం అందజేసి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాయం సర్వేశ్వరరావు, కాయం జగపతిరావు, వేముల శ్రీనివాసరావు, జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు గొగ్గల ఆర్కే దొర, తదితరులు పాల్గొన్నారు.

# 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి రైతు వేదికలో రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో అరుణ్ బాబు మాట్లాడుతూ జీలుగులు 200 క్వింటాళ్లు, జనుము 40 క్వింటాళ్లు, పిల్లి పెసర 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నా



యని తెలిపారు. రైతులు వ్యవసాయ విస్తర ణ అధికారులను సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా విత్తనాలు పొందాలని సూచించారు. పచ్చిరొట్ట సాగుతో భూసాం పెరిగి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నడిపల్లి సునంద, సర్పంచ్ చంద్రలేఖ, ఎండీ జహీరుద్దీన్, లలితారావు, నవీన్, మంగపతి, రవి, కేశవులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పెద్దహరిజన వాడ గ్రామానికి చెందిన ఇసన్నపల్లి కృష్ణ తన కూతురు శుభకార్యానికి మండు టెండలోనే కార్డులు పంచి సోమవారం 25 తారీఖున కూతురు ఫంక్షన్ ముగించుకొని ఇంటివద్ద సొమ్మసిల్లి పడిపోగా కుటుంబ సభ్యులు జూలూరుపాడు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి చికిత్స చేపిస్తుండగా జూలూరుపాడు ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్వో డాక్టర్ తుకారాం రాథోడ్ చికిత్స పొందుతూ హరిజనవాడ కు చెందిన ఇసనపల్లి కృష్ణ అనే వ్యక్తి గత మూడు రోజులగ వడదెబ్బతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నడు



చికిత్స విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత సాయంత్రం సమయంలో అతనిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత సోమవారం వల్ల పాపకు ఇంట్లో శుభకార్యం ఫంక్షన్ చేశాడు. కృష్ణ మరణంతో పాపకొల్లు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

# ఓటరు జాబితాలో చేర్పులు మార్పులపై పార్టీలతో సమీక్ష

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావే



శంలో ప్రత్యేక సవరణ కార్యక్రమం పారదర్శకంగా నిష్పక్షపాతంగా మరియు సమర్థవంతంగా నిర్వహించబడే విధానంపై విస్తృతంగా చర్చించారు. జాబితాలో ఓటర్లు నమోదు ,మరణించిన మరియు వలస వెళ్లిన ఓటరు జాబితా వివరాలతో మార్పులు, సవరణలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకునే విధంగా పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీలు ప్రతినిధులను సబ్ కలెక్టర్ కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రతి దశలో పార్టీల ప్రతినిధుల సహకారం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాలను సిద్ధం చేయండి



**-నిర్లక్ష్యానికి తావివ్వకండి**
**-గురుకుల సంక్షేమ విద్యా సంస్థలపై సమీక్షలో భట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాబోయే విద్యా సంవత్సరానికి గురుకుల విద్యా సంస్థలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంతో పాటు అన్ని సీట్లను భర్తీ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి గురుకుల విద్యాలయానికి ఇంచార్జి అధికారిని నియమించాలని ఆయన సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో గురుకుల విద్యాలయాల్లో సంక్షేమం, వసతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి ఏడాది గురుకుల విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీట్లు పూర్తి కానీ రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. జూన్ 12 విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని మరమ్మతులు అవసరమైతే ఈలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలు తెలిపేవిధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఇంచార్జీలు ప్రతి నెల గురుకుల పాఠశాలలను సందర్శించి వివరాలు తెలుసుకుని ఒక నివేదిక సమర్పించాలని భట్టి విక్రమార్క సూచించారు. నిరంతరం తనిఖీలను జరిగేవిధంగా చూడడడంతో పాటు వైద్య పరీక్షలు కూడా ప్రతి నెల నిర్వహించాలని ఇందుకు సంబంధించి ఒక నివేదికను సిద్ధం చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న వాటికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అందుకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని విక్రమార్క సూచించారు. సమీక్షలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్తలు, విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికలకు రూ.26వేలు వేతనం అందించాలి

**ప్రజాపక్షం/వైరా:** మహిళ సాధికారణ కోసం నిరంతరం మహిళల అభివృద్ధి కోసం గ్రామాల్లో గ్రామదీపికలు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని, అలాంటి గ్రామదీపికల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు అన్నారు. బుధవారం వైరాలో గత కొద్ది రోజుల నుండి గ్రామదీపికలు చేస్తున్న రిలే నిరహార దీక్షకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కట్టా కృష్ణార్జున్‌రావు మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి పరిష్కరించకుండా మొఖం దాటేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ దీపికల సమస్యలను వెంటనే పరిష్కరించి నెలకి వారికి రూ.26 వేలు వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. మండుటెండల్లో వడగాల్పులు వస్తున్నాయని, అయినా కూడా గ్రామదీపికలు వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టెంట్ క్రింద రిలే నిరహార దీక్షలు చేస్తున్న కూడా ప్రభుత్వంలో చలనం లేదని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వం గ్రామదీపిక సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగ భద్ర తకల్పించాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామదీపికలతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు చిలకా చిన్న కోటయ్య, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, అప్పం సురేష్, మాదినేని దుర్గాప్రసాద్, బట్టా భద్రయ్య, తన్నీరు నాగేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, ఏదునూరి శ్రీనివాసరావు, కారుకొండ బోస్, ఆదూరి ప్రేమ్, దాసు, ఏలూరు నర్సింహారావు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రకటించిన చమురు ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలి


**ప్రజాపక్షం/జూలూరుపాడు:** కేంద్రంప్రభుత్వం ప్రకటించినతక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డిమాండ్ చేశారు. ప్రజా పంథా జూలూరుపాడు మండల కమిటీ సమావేశం తోటకూరి నరేష్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి పార్టీ డివిజన్ కార్యదర్శి జె కృష్ణ మండల కార్యదర్శి బానోతు ధర్మ మాట్లాడుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చమురు ధరలను తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో నరేంద్ర మోడీ పాలన రైతు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని వారు అన్నారు. చమురు ధరలు పెరగటంతో ప్రజలు వాడే నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగే ప్రమాదం పొంచి ఉన్నదని దీనివల్ల అశేష ప్రజలపై పన్నుల భారం పడుతుందని వారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని వారు అన్నారు. పెట్రోలు, గ్యాస్, డీజిల్, ధరలు పెరగటంతో ఎగుమతి దిగుమతి సరుకులపై పన్నులభారం పడుతుందని దీనివల్ల రైతులకు వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు సరఫరాలో ధరలు పెంపు తోటి .కొరతలతోటి పాలన కొనసాగిస్తున్నారని దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేని ఎడల ప్రజా వ్యతిరేకత ను చవి చూడక తప్పదని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీజిల్లా నాయకులు ఎదలపురం గోపాలరావు, మండల నాయకులు లింగాల, వీరభద్ర, ధనమంతరావు, రాయల సీదు, కుంచపు జమలయ్య, తోటకూరి కల్తీ శేఖర్ పాల్గొన్నారు.



# చికెన్ ఆర్డర్ చేస్తే అందులో బల్లి..!

**- దాబా నిర్వాహకులను పిలిపించి విచారించిన సీఐ**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మంసూర్యాపేట రహదారిపై ఉన్న రమేష్‌దాబాలో ఓ కస్టమర్‌కు మంగళవారం రాత్రి చేదు అనుభవం ఎదురైంది. చికెన్ ఆర్డర్ చేయగా అందులో చనిపోయిన బల్లి కనిపించడం కలకలం రేపింది. దీనిపై ప్రశ్నించిన కస్టమర్‌కు దాబా నిర్వాహకుల నుంచి అలసత్వమైన సమాధానం రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే ఓ వ్యక్తి దాబాకు వెళ్లి చికెన్ ఆర్డర్ చేశారు. అందులో అనుమానాస్పదంగా ఓ వస్తువు కనిపించడంతో పరిశీలించగా అది చనిపోయిన బల్లిగా గుర్తించాడు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. ఈ విషయంపై కస్టమర్ దాబా నిర్వాహకులను నిలదీయగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దాబాను మూసి వేపించి, ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.



ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించకపోతే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దాబాపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ముస్లింలకు కూనంనేని బక్రీద్‌శుభాకాంక్షలు




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లీం కుటుంబాల వారికి సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుభా కాంక్షలు తెలిపారు. త్యాగం, సేవాభావం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ సమాజంలో ఐఖ్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతీ కుటుంబంలో సుఖ సంతోషాలు నెలకొని, శాంతి సామరస్యంతో జీవించాలని, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

# పోక్సో కేసులో నిందితునికి ఏడేళ్ల జైలు

**-రూ. 50వేలు జరిమానా**

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఇంటి బయట ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను ఇంటి పక్కనే ఉంటున్న బోయినపల్లి వీరబాబు (40) మాయ మాటలతో తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి. శ్రీనివాసరావు తీర్పునిచ్చినట్లు ఖమ్మం గ్రామీణ ఏసిపి తిరుపతిరెడ్డి తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... 2023 మే 28న ఖమ్మం గ్రామీణ మండలానికి చెందిన బోయినపల్లి వీరబాబు ఓ బాలికను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి టివి సౌండ్ ఎక్కువ పెట్టి లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో చట్టం 2012 క్రింద కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ వేగవంతంగా పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు ప్రాసిక్యూటర్ శరత్ కుమార్‌రెడ్డి వాదించగా విచారణ అధికారులు, ఎస్ఐ వెంకటకృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం. ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ ఎం. వెంకయ్య, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, హోంగార్డు చిట్టిబాబు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# గోల్‌తండాలో భార్యను చంపిన కేసులో భర్త, అత్తమామలకు రిమాండ్



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** కట్టుకున్న భార్యను చిత్రహింసలను గురిచేసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన గోల్ తండా కేసులో నిందితులను రిమాండ్ చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో తండాలో మే 22 బానోతు మీనాక్షీ తన నివాసంలో మీనాక్షి ఉరి వేసుకుని చనిపోవడం కట్టు కథ అని మీనాక్షిని చిత్రహింసల గురి చేసి అతి కిరాతంగా హత్య చేసి తానే తన చున్నీతో ఉరివేసుకున్నట్లు చిత్రీకరించి హత్యకు ఆత్మహత్యగా చిత్రీకరించబోయారని మీనాక్షి తల్లి భారతి ఆరోపిస్తూ నా కూతురు మీనాక్షి కట్టుకున్న భర్త శివాజీ అత్త మామ బానోతు శ్రీను, బానోతు దుబ్లీ శివాజీ ఇంటి పక్కనే ఉన్న గంట లక్ష్మీతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన కూతరి మీనాక్షిని అతికిరాతంగా నలుగురు హత్య చేశారని ఆరోపిస్తూ మీనాక్షి తల్లి గుగులోతు భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి మీనాక్షి మృతికి కారణమైన వారిని రిమాండ్ నిమిత్తం కోర్టు హాజరు పరిచి రిమాండ్ తరలించినట్లు ఆయన తెలిపారు. మీనాక్షి కేసులో ఏ2గా ఉన్న గంటలక్ష్మి బుధవారం కోర్టు లొంగిపయినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్నానాల లక్ష్మి పురం గ్రామపంచాయతీ జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్దకు గ్రామ సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు వెళ్లి వడగాల్పులతో పాటు వేడి తీవ్రతగా ఉండటంతో ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పని చేసేటప్పుడు జాగ్రత్తగా పాటించాలని, త్రాగునీరు దగ్గర ఉంచుకోవాలని, అనారోగ్యంగా కళ్లు తిరగడం కనిపిస్తే వెంటనే నీడ వద్దకు వెళ్లి సేద తీర్చుకొని డాక్టర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లు లత పాల్గొన్నారు.

# పల్లెలకు పోదాం.. దళితులను చైతన్యవంతులుగా చేద్దాం

**40 రోజుల కార్యాచరణ విజయవంతం చేద్దాం**




**ప్రజాపక్షం/మణుగూరు:** పల్లెలకు పోదాం దళితులను చైతన్యవంతులుగా చేద్దాం అని ఎమ్మార్పీఎస్ పినపాక నియోజకవర్గ ఇంచార్జి కొమ్ము హుస్సేన్ మాదిగ, ఎంఆర్పిఎస్ మణుగూరు మండల అధ్యక్షులు పోడుతురి కళ్యాణ్ బాబు మాదిగ అన్నారు.మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మణుగూరు మండలం లంక మల్లారం బడికి పోనీ పిల్లలను బడికి వెళ్లాలని వారి తల్లిదండ్రులకు బడికి పంపాలనే ఉద్దేశంతో, అక్షరమే ఆయుధమని విద్య ఆస్తిల్లాగా పంచుకునేది కాదు చదువుకున్నవారే విద్యావంతులు అవుతారు విద్యను అందరికీ అందించటమే మనం బాధ్యత అని ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పొడుతూరి రవి, రాంచరణ్, ఆదిత్య, రోహన్, నవదీప్, సాయి, అఖిల్, నిహాల్, విద్య న్ బాబు, విసిల్, సిద్ధార్థ, కార్తీక్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.